వాస్తవం

డిజిటల్ పత్రిక

ఉన్నది ఉన్నట్లుగా

డెయిలీ కాపీ

శనివారం 28.11.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి

డీలిమిటేషన్ బిల్లును అడ్డుకుంటాం



న్యూఢిల్లీ, నవంబరు 27 : కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమి టేషన్) బిల్లును పార్లమెంటులో అడ్డుకొని తీరుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి వేసేందుకే ఈ బిల్లును ముందుకు తెస్తోందని ఆరోపించింది. ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యలోనే మహిళలకు 33 శాతం కోటాను అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఈ నెల 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత సోనియాగాంధీ నివాసంలో ఆ పార్టీ ప్రముఖులు శుక్రవారం సమావేశ మయ్యారు. రాబోయే 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్ల సంఖ్యలో ఎలాంటి మార్పులు చేయవద్దని డిమాండ్ చేస్తూ ఈ సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం ఎక్స్ వేదికగా ఆ పార్టీ నేత జైరాం రమేశ్ కేంద్రంపై విమర్శలు గుప్పించారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సిద్ధం

- సంక్రాంతి తర్వాత ప్రతి నెలా 2వేల కోట్ల పనులు
- రాబోయే 8 నెలల పాటు ఎల్‌నినో ప్రభావం
- 'క్లైమేట్ కాన్‌క్లేవ్' సన్నాహక భేటీలో సీఎం రేవంత్

రాష్ట్రంలో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రూ.10వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని సిద్ధం చేశామని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాబోయే 8 నెలల పాటు ఎల్‌నినో ప్రభావం ఉంటుం దని చెప్పారు. అందుకే సంక్రాంతి తర్వాత ప్రతి నెలా రూ.2వేల కోట్ల విలువైన పనులు చేపట్ట నున్నట్టు తెలిపారు. రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటలకు దూరంగా ఉండాలని కోరారు.



26 లోక్‌సభ..
182 అసెంబ్లీ స్థానాలు

పునర్విభజన బిల్లు ఆమోదం పొందితే

తెలంగాణ ప్రాతినిధ్య ముఖచిత్రమిదే

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందితే.. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో ప్రజాప్రాతినిధ్య ముఖచిత్రం మారుతుంది. ప్రధాన పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకత్వానికి, మహిళలకు అవకాశాలు పెరుగుతాయి. బిల్లు లు ఆమోదం పొందితే 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో ప్రతి రాష్ట్రానికీ 50 శాతం సీట్లు పెరుగుతాయి. ప్రస్తుతం తెలంగాణకు 17 లోక్‌సభ స్థానాలున్నాయి. అవి 50 శాతం పెరిగితే.. ఎంపీ సీట్ల సంఖ్య 26 అవుతుంది. ప్రస్తుతం ఒక్కో లోక్‌సభ సీటుకూ ఏడు చొప్పున అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అదే నిష్పత్తిలో పెంచితే.. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గానికి ఏడు చొప్పున మొత్తం 182 అసెంబ్లీ నియోజకవ ర్గాలు ఏర్పాటవుతాయని చెబుతున్నారు. అలా కాకుండా అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలోనూ 50 శాతం పెంపువిధానాన్ని అమలు చేస్తే.. ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 179కి పెరుగుతుందని చెబుతున్నారు.



పునర్విభజనకు రెడీ

- లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపు
- అన్ని రాష్ట్రాల శాసనసభ స్థానాలు కూడా..
- నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఓకే
- ప్రస్తుతమున్న 543 సీట్లు గరిష్ఠంగా 850కి పెంపు
- ఎమ్మెల్యేల సంఖ్య పరిమితిని 500 నుంచి 650కి పెంచే వీలు
- అందులో మహిళలకు 33శాతం రిజర్వు.. 2029 నుంచి అమలు
- 2011 జనాభా లెక్కలతోనే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ
- 2051 వరకు మళ్లీ సీట్లలో మార్పులు చేయరాదని ప్రతిపాదన
- ముసాయిదా విడుదల.. 30న లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లు
- లోక్‌సభలో ఏ రాష్ట్ర ప్రాతినిధ్యం తగ్గదని కేంద్రం భరోసా
- సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించండి: రిజిజు
- బిల్లు ఆమోదానికి మద్దతు కోసం బీజేపీ అగ్రనేతల యత్నాలు

న్యూఢిల్లీ, నవంబరు 27 : లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ అమలు కోసం రూపొందించిన 132వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర మంత్రిమండలి శుక్రవారం ఆమోదించింది. లోక్‌సభ నియోజకవర్గాలు ప్రస్తుతం 543 ఉండగా.. వాటిని గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించారు. ప్రతి రాష్ట్రంలోనూ లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచాలని నిర్ణయించారు. ప్రధాని కార్యాలయం సేవా తీర్థ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ బిల్లుకు ఆమోదముద్ర వేశారు. అనంతరం బిల్లుకు సంబంధించిన ముసాయిదాను ప్రభుత్వం విడుదల చేసింది. నియోజకవర్గాల పెంపు కోసం ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టగా తగినంత మందిసభ్యుల మద్దతు లభించకపోవటంతో ఆమోదం పొందని విషయం తెలిసిందే. నాటి బిల్లులోని కొన్ని అంశాలను సవరించి కొత్తగా కేంద్రం బిల్లును రూపొందించింది. గత బిల్లులో అన్ని రాష్ట్రాల్లో సీట్లను 50 శాతం పెంచటంపై స్పష్టత ఇవ్వకపోవటంతో అనేక పార్టీలు దానిని వ్యతిరేకించాయి. తాజా బిల్లులో దీనిపై స్పష్టత ఇచ్చారు. ఈ బిల్లు ఆమోదం ద్వారా సీట్లను పెంచిన తర్వాత 2051 వరకు వాటిలో మళ్లీ మార్పులు చేయరాదని ప్రతిపాదించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల్లో నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించారు. నియోజకవర్గాల పునర్విభజనతోపాటు లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ప్రతిపాదించారు. డీలిమిటేషన్ కమిషన్ నిర్ణయం మేరకు మహిళా రిజర్వేషన్ రొటేషన్ అమలు చేయాలని నిర్ణయించారు.

అంతేకాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభ స్థానాలను కూడా 50 శాతం చొప్పున పెంచాలని ప్రతిపాదించారు. ఇందుకు రాష్ట్రంలో ఎమ్మెల్యేల గరిష్ఠ సంఖ్య ప్రస్తుతం 500 ఉండగా.. వాటిని 650కి పెంచే వీలు కల్పించారు. ఈ బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబరు 3 వరకు నాలుగు రోజులపాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తోంది. కాగా, ఈ బిల్లును ఈ నెల 30న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. దీంతో గతంలో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఉపసంహరించుకోనున్నట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనతో లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గబోదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేశాయి. ప్రతి రాష్ట్రానికి సభలో ప్రస్తుతం ఎంతశాతం ప్రాతినిధ్యం ఉందో.. సీట్ల పెంపు తర్వాత కూడా అంత శాతం కొనసాగుతుందని పేర్కొన్నాయి. అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్ల పెంపు ద్వారా ఈ మేరకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేలా ప్రతి సభ్యుడు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా మనకు ఉన్న గుర్తింపును, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉందని పేర్కొన్నారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామంటే.. అందులో ప్రవేశపెట్టే బిల్లులు దేశానికి ఎంత ముఖ్యమో అర్థం చేసుకోవాలని కోరారు. కాగా, ఈ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి శనివారం సమావేశం అవుతున్నట్లు తెలిసింది.లోక్‌సభలో మొత్తం 543 స్థానాలకుగాను ప్రస్తుతం మూడు ఖాళీలు పోగా 540 మంది సభ్యులున్నారు. వీరందరూ ఓటు వేస్తే.. బిల్లు ఆమోదానికి రెండింట మూడో వంతు మెజారిటీగా 360 మంది సభ్యుల మద్దతు అవసరమవుతుంది. కాగా, ఎన్‌డీఏకు ఇప్పటికే 321 మంది సభ్యుల మద్దతు ఉంది. వీరిలో బీజేపీ సభ్యులు 240 మంది ఉండగా, టీడీపీ-16, జేడీయూ-12, శివసేన (ఏక్‌నాథ్ షిండే)-13తోపాటు లోక్‌జనశక్తి (రాంవిలాస్ పాశ్వాన్), నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ (టీఎంసీ చీలిక వర్గం), శిరోమణి అకాలీదళ్, అప్నాదళ్, అసోం గణపరిషత్ వంటి చిన్నాచితక పార్టీలు, స్వతంత్రులు ఉన్నారు. వీరు కాకుండా నలుగురు సభ్యులున్న వైసీపీ కూడా ఎన్డీఏకు మద్దతు తెలిపే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో బిల్లు ఆమోదానికి అధి కార పక్షానికి మరో 35 మంది సభ్యుల మద్దతు అవసరమవుతుందని చెబుతున్నా యి. అయితే ఈ సంఖ్యను కూడగట్టేందుకు తమకు రెండు కీలక మార్గాలున్నాయని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా 22 మంది సభ్యులున్న డీఎంకే, 8 మంది సభ్యులున్న ఎన్‌సీపీ (శరద్‌పవార్ వర్గం) తమకు మద్దతిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశాయి. లోక్‌సభలో తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.18 శాతం సీట్ల వాటా తగ్గకూడదని, దీంతోపాటు ఈ పెంపును మరో 25 ఏళ్లపాటు అలాగే కొన సాగించాలన్నవే తమ డిమాండ్లు అని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అంటున్న విషయం తెలిసిందే.

దేశానికి రోల్ మోడల్ కానున్న
తెలంగాణ భూ సర్వే

మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నవంబర్ 27: తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం హైద రాబాద్‌లో విలేకర్లతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తెలంగాణలోని అన్ని శాఖలపై కేంద్రం వివక్ష చూపిస్తోందని విమర్శించారు. కరువు బృందం వచ్చినా.. ఆశిం చిన స్థాయిలో తెలంగాణకు నిధులు వస్తాయని అనుకోలేమని అన్నారు. 13 లక్షల ఇం దిరమ్మ ఇళ్లు అడిగితే.. కేవలం 2 లక్షల ఇళ్లు మాత్రమే ఇచ్చారంటూ పెదవి విరిచారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్ లెక్కలు, ధరణి సీఐడీ కేసు దాదాపు తుది దశకు వచ్చాయని తెలిపారు. సాంకేతిక అం శాలు – సరైన లెక్కలతో బీఆర్ఎస్ అక్రమాలను బయటపెడతామని స్పష్టం చేశారు. తెలంగాణలో భూ సర్వే వేగంగా జరు గుతుందని.. ప్రతీ జిల్లాలో ఇది జరుగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి పారు. ఈ భూ సర్వే పూర్తి అయితే.. సాధా ఖైనమా సమస్యలు ఉండవని వివరించారు. భూ సర్వే పూర్తయితే ఫారెస్ట్ నుంచి 26 లక్షల భూమికి క్లియర్ టైటిల్ ఇవ్వబోతున్నా మని ప్రకటించారు. భూ సర్వే పూర్తయితే సర్వే నంబర్ కాకుండా స్పెషల్ ఖాతా నం బర్ ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. భూ సర్వే పూర్తయ్యాక భూమి తక్కువ ఉన్న అర్హు లకు ఫైనల్ స్టేజ్‌లో సెట్ చేస్తామని అ న్నారు. వచ్చే మంగళవారం నుంచి మూడు రోజు లు ప్రతి జిల్లా చొప్పున సమీక్ష చేయ నున్నా మని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివ రించారు. ఏడాదిన్నరలో రాష్ట్రం లో భూ సర్వే పూర్తి అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సర్వేల పేరుతో బీఆర్ఎస్ నేత లు పగటి కలలు కంటారని.. గోల్ మాత్రం తామే కొడతామని అన్నారు.తెలంగాణ భూ సర్వే. దేశానికి రోల్ మోడల్ కాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. డిసెంబర్‌లో గ్రామాల్లోకి వెళ్తానని – రాత్రుళ్లు అక్కడే ఉంటాన ని.. ప్రజల సమస్యలు వింటానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెండు పాస్ బుక్‌లు ఇస్తామని.. ఒకటి రెగ్యులర్.. మరొకటి వ్యవసాయానికి సంబంధించిం దని పేర్కొన్నారు. రెండు రంగుల్లో ఈ పాస్ బుక్‌లు ఉంటాయని.. అయితే వాటిపై ఫొటోలు మాత్రం ఉండవని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ

అధికారిక ప్రకటన విడుదల

ఢిల్లీ : ఐపీఎల్-2027 సీజన్ ప్రారంభానికి ముందు ముంబై ఇండియన్స్ మేనెజ్మెంట్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వరకు ముంబై జట్టు కెప్టెన్ ఎవరా? అనే ఉత్కంఠకు తెరదించింది. తమ జట్టు కెప్టెన్‌గా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మను మరోసారి ఎంపిక చేసింది. ఈ మేరకు ముంబై ఇండియన్స్ మేనెజ్‌మెంట్ ఎక్స్ వేదికగా అధికారిక ప్రకటన విడుదల చేసింది. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇటీవల అతడు పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్ కావడంతో రోహిత్‌కు తిరిగి జట్టు పగ్గాలను ఎంఐ యాజమాన్యం కట్టబెట్టింది. ఇక రోహిత్ శర్మ విషయానికి వస్తే ముంబై కెప్టెన్‌గా అతడికి అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. రోహిత్ 2013 నుంచి 2024 వరకు ముంబై జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ శర్మ నాయకత్వంలో ముంబై జట్టును ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. అయితే 2024 సీజన్‌కు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.గుజరాత్ టైటాన్స్ నుంచి పాండ్యాను ట్రేడ్ చేసుకున్న ముంబై ఫ్రాంచైజీ.. రోహిత్‌ను తప్పించి అతడికి పగ్గాలు అప్పగించింది. ఈ నిర్ణయంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్త మమయ్యాయి. అయినప్పటికి హార్దిక్‌ను మూడు సీజన్ల పాటు ముంబై తమ కెప్టెన్‌గా కొనసాగించింది. కానీ హార్దిక్ సారథ్యంలో ముంబై ఆశించిన ఫలితాలు సాధించలేక పోయింది. గత మూడు సీజన్లలో కేవలం ఒక్కసారి మాత్రమే ముంబై ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలోనే ముంబై యాజమాన్యం అతడిని పంజాబ్ ట్రేడ్ చేసి.. రోహిత్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది.



కొద్ది నెలలుగా...దుస్థితి..

పట్టించుకునే వారేరీ?

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 50వ డివిజన్‌లో పెద్ద కాలువ పరిస్థితి అధ్వానంగా మారింది గత కొన్ని నెలలుగా కాలువ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం వ్యర్థ పదార్థాలు తొలగించకపోవడంతో కాలువ అపరిశుభ్రంగా కనిపిస్తోంది. కాలువ గోడల వెంట ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి పారిశుధ్య సమస్య తీవ్ర రూపందాల్చింది. ఇప్పటికైనా 50వ డివిజన్‌లోని పెద్ద కాలువను పూర్తిస్థాయిలో శుభ్రం చేసి చెత్త పేరుకుపోకుండా నిరంతర పారిశుధ్య చర్యలు చేపట్టాలి.కాలువ దుస్థితిపై సంబంధిత అధికారులు డివిజన్ ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



చెత్తకుప్పల మధ్యే విద్యాబోధన

విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం

రెయిన్‌బో స్కూల్, బీసీ హాస్టల్, కృష్ణవేణి పాఠశాలల పరిసరాల్లో అపరిశుభ్రత

దుర్వాసన మధ్య చదువులు..

పట్టించుకోని యాజమాన్యాలు

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న 50వ డివిజన్ ప్రజాప్రతినిధులు?

(దాసరి వెంకట్)

వాస్తవం : గోదావరిఖని

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థల పరిసరాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. పాఠశాలల వద్ద పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యతను సంబంధిత యాజమాన్యాలు అధికారులు విస్మరిస్తున్నారా అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని గోదావరిఖని 50వ డివిజన్‌లో ఉన్న రెయిన్‌బో స్కూల్, బీసీ హాస్టల్, కృష్ణవేణి స్కూల్ పరిసరాల్లో కనిపిస్తున్న పరిస్థితులు విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.పాఠశాలలకు సమీపంలోనే రోడ్ల పక్కన చెత్తాచెదారం పేరుకుపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్త పదార్థాలు దర్శనమివ్వడం, మురుగు నీటి కాలువల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు నిత్యం వేలాది అడుగులు పడే విద్యాసంస్థల పరిసరాల్లోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పారిశుధ్య నిర్వహణ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది

దుర్వాసన మధ్యే విద్యాబోధన..

పాఠశాలల్లో విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకోవాల్సి ఉండగా బయట పేరుకుపోయిన చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పాఠశాలలకు వచ్చే చిన్నారులు ముఖ్యంగా బీసీ హాస్టల్‌లో ఉండే విద్యార్థులు ఇలాంటి పరిసరాల్లో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది చెత్తకుప్పల వద్ద పశువులు సంచరిస్తూ వ్యర్థాలను చిందరవందర చేస్తుండటంతో అపరిశుభ్రత మరింత పెరుగుతోంది. దోమలు ఈగలు పెరిగే అవకాశం ఉండటంతో విద్యార్థుల ఆరోగ్య భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు

యాజమాన్యాల బాధ్యత ఏమిటి?

విద్యాసంస్థలను నిర్వహిస్తున్న యాజమాన్యాలు విద్యార్థులకు విద్యాబోధన అందించడమే కాకుండా తమ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది పాఠశాలల ముందు పక్కనే చెత్త పేరుకుపోతుంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత కూడా యాజమాన్యాలపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు విద్యార్థుల ఆరోగ్యం కంటే ఇతర అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి

50వ డివిజన్ కార్పొరేటర్ దృష్టికి సమస్య చేరలేదా?

డివిజన్‌లోని విద్యాసంస్థల పరిసరాల్లో ఇంతటి అపరిశుభ్రత కనిపిస్తున్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు ప్రజా సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాల్సిన బాధ్యత డివిజన్ కార్పొరేటర్‌పై ఉంది అయినప్పటికీ ఈ పారిశుధ్య సమస్యపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే విషయం స్పష్టంగా తెలియాల్సి ఉంది సమస్యను పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ చెత్త తొలగింపు మురుగునీటి కాలువల శుభ్రతపై పర్యవేక్షణ చేయాల్సి ఉంది పాఠశాలలు, హాస్టళ్ల సమీపంలోనే ఇలాంటి పరిస్థితులు కొనసాగుతుంటే పారిశుధ్య నిర్వహణపై అధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి కేవలం పారిశుధ్య కార్యక్రమాల పేరుతో ప్రచారం చేయడం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు



ఇప్పటికైనా స్పందిస్తారా

విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రెయిన్‌బో స్కూల్ బీసీ హాస్టల్ కృష్ణవేణి స్కూల్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలని నిరంతర పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు పాఠశాలల యాజమాన్యాలు కూడా తమ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాసంస్థల వద్దే అపరిశుభ్రత తాండవిస్తుంటే బాధ్యత ఎవరిది. యాజమాన్యాలదా నగరపాలక సంస్థ అధికారులదా. స్థానిక ప్రజాప్రతినిధులదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది .ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి 50వ డివిజన్‌లోని విద్యాసంస్థల పరిసరాలను పరిశుభ్రంగా



మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పట్టించుకునేది ఎవరు?

స్థానికురాలు ధనలక్ష్మి



పాఠశాలకు వెళ్లే విద్యార్థులు చెత్తాచెదారం నుంచి వెలువడుతున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రతిరోజూ ఇదే పరిస్థితి ఉండటంతో చిన్నపిల్లలు దుర్వాసనను భరించలేక ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.

చాలాసార్లు చెప్పా..పట్టించుకోలేదు

కొమురయ్య, స్థానికులు



ఈ ఏరియా కార్పొరేటర్‌కు , స్కూలు యజమాన్యాలకు చాలాసార్లు చెప్పాం. ఈ చెత్త వాసన మా ఇండ్లలోకి బాగా వస్తుంది. స్కూలుకు వెళ్లే పిల్లలకు వాళ్ళ తల్లిదండ్రులకు చాలా ఇబ్బందికరంగా ఉంది అని చాలాసార్లు చెప్పిన ఎవరూ పట్టించుకోవట్లేదు .దయచేసి ఈ స్కూల్లో మధ్యలో చెత్తలు తీయాలని కోరుకుంటున్నా.



చెత్త సేకరణలో జాప్యం

స్థానికుడు లింగమూర్తి



రెండు రోజులకు ఒకసారి మాత్రమే చెత్త సేకరణ వాహనం వస్తోంది. ప్రతిరోజూ చెత్తను తొలగిస్తే పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు, దుర్వాసన సమస్య కూడా తగ్గుతుంది.ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు చెత్త నుంచి వెలువడే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సంబంధిత అధికారులు స్పందించి ప్రతిరోజూ చెత్త సేకరణ చేపట్టి విద్యార్థులకు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఉద్యమకారులు, కార్మికుల సంక్షేమం కోసమే

తిరిగి బీఆర్ఎస్‌లో చేరిక

కేసీఆర్ నాయకత్వంపై నమ్మకంతో
సొంత గూటికి చేరిన తోడేటి శంకర్ గౌడ్,
స్వరూప, మద్దెల శ్రీనివాస్
విజయమ్మ నివాసంలో చేరిక కార్యక్రమం
స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

వాస్తవం : గోదావరిఖని బ్యూరో

తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం పోరాడిన తోడేటి శంకర్ గౌడ్, ఆయన సతీమణి స్వరూప, తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు మద్దెల శ్రీనివాస్ తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. విజయమ్మ నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులకు న్యాయం జరగాలనే లక్ష్యంతో తోడేటి శంకర్ గౌడ్ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఉద్యమకారుల కోసం మరో రాజకీయ పార్టీ ప్రారంభమైన సమయంలో అందులో కొంతకాలం పనిచేసినప్పటికీ, కేసీఆర్ నాయకత్వంలోనే ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందనే విశ్వాసంతో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ నాయకత్వంపై నమ్మకంతో శంకర్ గౌడ్, స్వరూప, మద్దెల శ్రీనివాస్ తిరిగి పార్టీలోకి రావడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంతంలోని ఉద్యమకారులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం



వారితో కలిసి పనిచేస్తామని తెలిపారు. మద్దెల శ్రీనివాస్ గతంలో తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారని చందర్ గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కార్మికులకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగడం లేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ శంకర్ గౌడ్, స్వరూప, శ్రీనివాస్‌లు ఉద్యమ కార్యక్రమాలతో పాటు ప్రజలకు సేవలందించారని తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, ఉద్యమకారులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి వారంతా కలిసి పనిచేస్తారని పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతంలో గులాబీ జెండా ఎగిరిందని, భవిష్యత్తులోనూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని చందర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రామగుండం ప్రాంతంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం పనిచేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, మెతుకు దేవరాజ్, నూతి తిరుపతి, దొమ్మేటి వాసు, అచ్చే వేణు, కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల పట్టివేత



వాస్తవం : గోదావరిఖని బ్యూరో

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ నార్కోటిక్ టీమ్/టాస్క్‌ఫోర్స్‌కు అందిన విశ్వసనీయ సమాచారంతో గోదావరిఖని 8 ఇంక్లైన్ కాలనీలో, గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంటి ఆవరణలో డబ్బులు పందెంగా పెట్టి అక్రమంగా పేకాట ఆడుతున్న స్థావరంపై సంయుక్తంగా దాడులు నిర్వహించారు.టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో ఎస్ఐ దీకొండ రమేష్, ఆర్ఎస్ఐ ప్రవీణ్, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు మరియు సిబ్బంది కలిసి నిర్వహించిన ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకున్నారు.పట్టుబడిన తొమ్మిది మందిని,వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న పేకముక్కలు, నగదు మరియు సెల్‌ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పేకాట, జూదం తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచి,కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ మండల అధ్యక్షులు
కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ
చైర్మన్ చిప్పలపల్లి మహేంద్ర నాథ్

వాస్తవం : అడ్డగూడూరు :

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 29న మోత్కూర్ మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతి నిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయా లని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొమ్మిడి ప్రభా కర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేం ద్ర నాథ్‌లు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ... కెసిఆర్ దీక్ష ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన చేయడం జరిగిందన్నారు. 2009 నవంబర్ 29న తెలం గాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు



పూనుకున్నారని గుర్తు చేశారు. 'కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో' అనే నినాదంతో సాగిన ఆ పోరాటం తెలంగాణ ప్రజల్లో రాష్ట్ర సాధన కాంక్షను మరింత బలపరిచిందన్నారు. కేసీఆర్ దీక్షకు సంఘీ భావంగా విద్యార్థులు, యువత, ఉద్యోగులు, కార్మికులు, వివిధ ప్రజా సంఘాలు ఉద్యమ బాట పట్టాయని, ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల విద్యార్థుల ఉద్యమాలు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేశాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలతో ప్రజలు మోసపోయారని, గతంలో కేసీఆర్ మోసపోతే గోస పడతారని అన్నారని, ఇప్పటికైనా ప్రజలు మేల్కొని కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. ఆదివారం మోత్కూర్‌లో జరిగే దీక్ష దివస్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ యంపిపి దర్శనాల అంజయ్య, సర్పంచ్‌లు పూజారి వనజ సైదులు గౌడ్, మందుల రేణుక కిరణ్, దేశబోయిన నాగయ్య, మాజీ యంపిటీసి పూలపెల్లి జనార్దన్ రెడ్డి, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు చలపతి రెడ్డి, గజ్జెల్లి రవి, కో ఆప్షన్ మెంబర్ నాయకులు మాథాను ఆంథోని, మెట్టు బాస్కర్ రెడ్డి, కుకునూరు వెంకట్ రెడ్డి,జక్కుల రవి,బిఆరెస్ మండల యువ నాయకులు పరమేష్ గూడెపు, వెంపర్ల నర్సిరెడ్డి, చిప్పలపల్లి నరేందర్, నాయకులు కన్నేబోయిన ఎలేంధర్,శీలం దావిద్, పొన్నాల నవీన్ కుమార్,నిర్మాల వెంకటేష్, వంగూరి పేతురు, సంతోష్ కుమార్,శ్రీరాముల రాములు, శ్రీకాంత్, పయ్యావుల మత్స్యగిరి,రేకల ఇమ్మానేలు, బుడుగుండ్ల నర్సయ్య,బాస్కర్ రెడ్డి, తలపాక మహేష్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.



స్వామియే శరణమయ్యప్పా నామస్మరణతో
మారుమోగిన రాచర్లగొల్లపల్లి



వాస్తవం: ఎల్లారెడ్డిపేట:

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామానికి శ్రీ అయ్యప్ప స్వామి కోటి నామార్చన అఖండ రథయాత్ర శుక్రవారం చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలోని అయ్యప్ప దీక్షాపరులు, గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో రథయాత్రకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా స్వామియే శరణమయ్యప్పా.. స్వామియే శరణమయ్యప్పా.. అనే అయ్యప్ప నామస్మరణతో రాచర్లగొల్లపల్లి గ్రామం మారుమోగింది. అయ్యప్ప స్వాముల భజనలు, భక్తుల నినాదాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ పి. శ్రీనివాస్ యాదవ్, చంద్రమోహన్ రెడ్డి, యువ నాయకులు పొన్నాల వెంకటేశ్వర్ రెడ్డి, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప దీక్షాపరులు, మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.కేరళ నుంచి బయలుదేరిన అయ్యప్ప స్వామివారి రథయాత్రకు బొప్పాపూర్ గ్రామంలో కూడా ఘన స్వాగతం పలికారు. బొప్పాపూర్ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి, శ్రీనివాస్ రెడ్డి దంపతులు రథయాత్రకు స్వాగతం పలి కారు. ఈ కార్యక్రమంలో స్థానిక అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

2034 వరకు సీఎం రేవంత్ రెడ్డే



వాస్తవం : ఎల్లారెడ్డిపేట

తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమేనని, 2034 వరకు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డే కొనసాగుతారని ఏఎంసీ చైర్మన్ మేడిపల్లి దేవానందం, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య ధీమా వ్యక్తం చేశారు.నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ, 4.70 లక్షల మందికి చేయూత పింఛన్ల మంజూరు, పంపిణీ కార్యక్రమాలను పురస్కరించుకుని శుక్రవారం ఎల్లారెడ్డిపేట పాత బస్టాండ్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతున్న తరుణంలో ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా కొనసాగిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ భూములున్న రైతులకు మాత్రమే రైతుబీమా పథకం ఉండేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేయడం గొప్ప విషయమన్నారు. దేశంలోనే ప్రత్యేకమైన ఈ పథకం పేద కుటుంబాలకు ఎంతో భరోసా కల్పిస్తుందని తెలిపారు.

అకాల వర్షంతో అందోల్ రైతులు ఆగమాగం

తడిసి ముద్దైన వరి ధాన్యం

వాస్తవం : అందోల్

అందోల్‌లో కురిసిన అకాల వర్షంతో రైతులు ఆగమాగం అయ్యారు. చేతికి అందిన పంట వరదల్లో కొట్టుకు పోయింది. జోగిపేట జోగిన్నాథ్ గంజిలో ఆరబోసిన వరి ధాన్యం గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దయింది. ధాన్యాన్ని సంచుల్లో నింపిన గుట్ట మీద నుండి వచ్చిన వరదకు ధాన్యం కొట్టుకుపోయింది. సంచుల్లో నింపిన వరి ధాన్యం సైతం సగం సంచి వరకు తడిసి ముద్దయింది. దాన్ని ఆరబోయడానికి రైతులు పడుతున్న ఇబ్బంది వర్ణాతీతం. సకాలంలో లారీ రాకపోవడంతోని వర్షానికి దొరికినట్టు రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని టిఆర్ఎస్ నాయకులు ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి డిమాండ్ చేశారు. ఆయన చౌటుకూర్ మండలంలోని సుల్తాన్పూర్, సరాపల్లి, కొర్పోల్, చౌటకూర్ గ్రామాలను



సందర్శించారు. రోడ్లపై ఆరా పోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆయనతో మొరపెట్టుకొని వాపోయారు. దీంతో తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



25 చర్చిలకే రూ.30 వేల ఆర్థిక సాయం

మిగతా చర్చిల పరిస్థితి ఏంటి?

దళిత క్రైస్తవ ఉద్యమ నేత పల్లె శాంతిరాజు

వాస్తవం : పెద్దపల్లి ప్రతినిధి

క్రిస్మస్ పండుగ సమీపిస్తున్న వేళ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్చిలకు రంగులు వేయడం, విద్యుత్ దీపాలతో అలంకరించడం కోసం ఆర్థిక సహాయం అందించాలనే నిర్ణయం స్వాగతించ దగినదే. అయితే ఈ సహాయం పంపిణీలో అనుసరిస్తున్న విధానం మాత్రం అనేక ప్రశ్నలకు తావిస్తోంది.గత సంవత్సరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 50 చర్చిలకు రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించగా, ఈ ఏడాది కేవలం 25 చర్చిలకే సహాయం అందించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ఏడాదితో పోలిస్తే చర్చిల సంఖ్యను సగానికి తగ్గించడంలో ప్రభుత్వం అనుసరించిన ప్రాతిపదిక ఏమిటో స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని దళిత క్రైస్తవ ఉద్యమ నేత పల్లె శాంతిరాజు ప్రశ్నించారు. ఒక నియోజకవర్గంలో వందలాది చర్చిలు ఉండే అవకాశం ఉన్నప్పుడు కేవలం 25 చర్చిలను మాత్రమే ఎంపిక చేయడం వెనుక ఉన్న ప్రమాణాలేమిటి? అధికార పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సుల ఆధారంగానే ఈ ఎంపిక జరుగుతుందా? చిన్న గ్రామాల్లోని పేద క్రైస్తవ సంఘాలకు ఈ సహాయం అందే అవకాశం లేదా? అనే ప్రశ్నలు క్రైస్తవ సమాజంలో వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం ప్రజాధనంతో అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలి. పెద్ద చర్చిలకే ప్రాధాన్యత లభించి, చిన్న చర్చిలు, పేద క్రైస్తవ సంఘాలు విస్మరణకు గురైతే అది సమానత్వ స్ఫూర్తికి విరుద్ధం కాదా అని ఆయన ప్రశ్నించారు. క్రిస్మస్ అనేది కేవలం చర్చిలకు రంగులు వేయడం, విద్యుత్ దీపాలతో అలంకరించడం



మాత్రమే కాదు. ప్రేమ, కరుణ, సమానత్వం, మానవత్వం, పేదల పట్ల బాధ్యతను గుర్తుచేసే పవిత్ర పండుగ. క్రైస్తవ సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం మరింత విస్తృతమైన సంక్షేమ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

కష్టపడితేనే ఫలితం : సిఎంపిఎఫ్ కమిషనర్ గోవర్ధన్

జెఎన్టియులో విజేతలకు బహుమతుల ప్రదానం

వాస్తవం : రామగిరి:

కష్టపడితేనే ఫలితం దక్కుతుందని, లక్ష్యానికి అనుగుణంగా నిత్యం క్రుషి చేయాలని సిఎంపిఎఫ్ గోదావరిఖని రీజియన్ కమిషనర్ డాక్టర్ కంటెపూడి గోవర్ధన్ పిలుపునిచ్చారు.విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ విజేతలకు శుక్రవారం బహుమతులతో పాటు నగదు అందజేశారు.కళాశాల ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు.విఫలంతోనే అనుభవాలు వస్తాయన్నారు. పోటీల్లో ఫెయిల్ అయితే నిరుత్సాహ పడవద్దని, విజయానికి నాందిగా భావించాలన్నారు. సమయం అతి ముఖ్యమైందని,ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలోని ముఖ్యులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించిన సిఎంపిఎఫ్ అధికారులకు ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలిపారు.విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.పెయింటింగ్ పోటీల్లో బి.సాహితి ప్రథమ,పి.సాత్వికకు ద్వితీయ,బి.సన్నిహితికి మూడవ బహుమతి,మధురవాణి నవ్య,డి. సాయిశ్రీలకు కన్సోలేషన్ బహుమతులు దక్కాయి.వ్యాసరచన పోటీల్లో బి.భారతికి ప్రథమ,ఆర్.అర్చనకు ద్వితీయ,టి.రక్షితకు మూడవ బహుమతి,జి.యశస్వీత,టి. మనీషలకు కన్సోలేషన్ బహుమతులు వచ్చాయి.వీరికి ప్రిన్సి పాల్,కమిషనర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్ కుమార్,ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు బి.లలిత, బి.కామేశ్వర్ రావ్, సీనియర్ ఎస్ఎస్ఏ జి.అనిత,ఎస్ఎస్ఏ జి. మోహన్, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ పాల్గొన్నారు.



డప్పు చాటింపుతో దీక్ష దివస్‌కు ఆహ్వానం

29న అలుగునూరులో భారీ సభ

వాస్తవం : బెజ్జంకి

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్ గ్రామంలో ఆదివారం జరిగే దీక్షా దివస్ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం బెజ్జంకి మండలంలోని ఆయా గ్రామాలలో డప్పు చాటింపు చేశారు. దీక్షా దివస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నట్లు చెప్పారు. ఒకప్పుడు గ్రామాల్లో ఏదైనా శుభకార్యం నిర్వహించాలన్నా, ముఖ్యమైన సమావేశం ఏర్పాటు చేయాలన్నా, ప్రజలకు సమాచారం చేరవేయాలన్నా డప్పు చాటింపే ప్రధాన ప్రచార సాధనంగా ఉండేదన్నారు. గ్రామంలో డప్పు చాటింపు వినిపిస్తే ఏదో ముఖ్యమైన కార్యక్రమం జరుగుతుందని భావించి ప్రజలంతా తప్పనిసరిగా హాజరయ్యేవారని గుర్తుచేశారు. అదే సంప్రదాయాన్ని గుర్తుచేస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టమైన దీక్షా దివస్ సభకు ప్రజలను ఆహ్వానించేందుకు డప్పు చాటింపు చేపట్టినట్లు వివరించారు.దీక్షా దివస్ అనేది కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించిన చారిత్రక సందర్భమని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులు, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు, కవులు, మేధావులు, వారి కుటుంబాలను స్మరించుకుని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.తెలంగాణ ఉద్యమ చరిత్రను గుర్తుచేసే దీక్షా దివస్ సభను ప్రతి ఒక్కరూ తమ సొంత కార్యక్రమంగా భావించి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జీ చింతం సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, రాష్ట్ర నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, చింతకింది శ్రీనివాస్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కచ్చు రాజయ్య, ముక్కిస తిరుపతి రెడ్డి, వంగల నరేశ్ , కల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల్లో

కార్పొరేట్ సేఫ్టీ జీఎం పర్యటన

వాస్తవం : రామగిరి :

సింగరేణి కార్పొరేట్ సేఫ్టీ విభాగం జనరల్ మేనేజర్ కృష్ణ గోపాల్ తివారి శుక్రవారం రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో పర్యటించారు.కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఏరియాకు విచ్చేసిన ఆయనకు జీఎం కార్యాలయంలో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ మల్లయ్య,ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా రామగుండం -3 ఏరియా జన రల్ మేనేజర్ సుంకర మధు సూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలి పాక నాగేశ్వరరావు, కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ కృష్ణ గోపాల్ తివారికి శుభా కాంక్షలు తెలియజేస్తూ, ఏరియాలో చేపడుతున్న భద్రతా చర్యలు,సేఫ్టీ ప్రమాణాల అమ లు తదితర అంశాలను వివరించారు. అనంతరం వారు ఓసిపి-2 ఉపరితల గనిని సం దర్శించి,వ్యూ పాయిం ట్ నుండి నడుస్తున్న పనులను పరిశీలించారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జియం యం.రామ్మో హన్,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జి.లక్ష్మీనారాయణ, విభాగధిపతులు బి. టి మురళీకృష్ణ, ఎస్.రవికుమార్,సి.జే. సురేఖ,అప్సర్ పాషా,కె.ఐలయ్య,కోల శ్రీనివాస్, ఎండి. ఆసిఫ్,శ్రీకాంత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే లక్ష్యం

వడ్డూరులో పోలీసుల విస్తృత తనిఖీలు



వాస్తవం : బెజ్జంకి

గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే లక్ష్యంగా బెజ్జంకి మండలం వడ్డూరులో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్, బెజ్జంకి ఎస్సై తోట తిరుపతితో పాటు పలువురు సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది గ్రామంలోని ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన ఏసీపీ అపరిచిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

కల్వచర్లలో బస్ షెల్టర్ నిర్మించాలి

మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి



వాస్తవం:రామగిరి:

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యంగా చిన్నపిల్లలతో పాటు మహిళలు, వృద్ధులు ఎండలోనే నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది అని ఎండ, వాన నుంచి రక్షణ లేకపోవడంతో ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు, గ్రామంలో బస్ షెల్టర్ లేకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ఈ సమస్యను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు.గ్రామ ప్రజల సౌకర్యార్థం కల్వచర్లలో నూతన బస్ షెల్టర్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి,నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

భూముల రీ-సర్వే ప్రారంభం

సహకరించాలి...సర్పంచ్ శనిగరం సత్యనారాయణ



వాస్తవం: మద్దూరు

మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో భూముల రీ-సర్వే ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. మద్దూరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శనిగరం సత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే అధికారులు ఆధునిక పరికరాలతో గ్రామ శివారు నుంచి భూముల కొలతలు చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ శనిగరం సత్యనారాయణ మాట్లాడుతూ.. గ్రామసభలో ప్రకటించిన విధం గానే గ్రామంలో భూముల రీ-సర్వే ప్రారంభించామని తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రక్రియను రైతులు, భూ యజమానులు సహకరించాలని కోరారు. భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకొని సర్వే సమ యంలో అధికారులకు పూర్తి వివరాలు అందించాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రి య సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు గ్రామస్తులు అధికారులకు సహకరిం చాలని ఆ యన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ కృష్ణ, సర్వేయర్ రమేష్, జీపీఓ రవి, గ్రామ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు

ఇందిరమ్మ కుటుంబం బీమా వర్తింప చేయాలి

దొంతరవేణి మహేష్ యాదవ్



వాస్తవం : బెజ్జంకి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఒంటరి మహిళలకు, ఒంటరి పురుషులకు వర్తింపచేయాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బెజ్జంకిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేషన్ కార్డులో ఒక్కరే ఉన్నారని ఇందిరమ్మ బీమా పథకానికి దూరం చేయడం అన్యాయం అని ప్రభుత్వం వెంటనే నిబంధనలు సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రేషన్ కార్డులో ఒక్కరి పేరు మాత్రమే ఉన్న ఒంటరి మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవ డానికి నామినీ సమస్య ఎదురవుతున్నట్లు స్పష్టం చేశారు. రేషన్ కార్డులో ఒక్కరే ఉన్నారనే కారణంతో, అదే రేషన్ కార్డులో మరొక కుటుంబ సభ్యుడు నామినీగా లేకపోవడంతో దరఖాస్తులు స్వీకరించకపోవడం ఆందోళనకరమన్నారు. భర్తను కోల్పోయిన మహిళలు, భార్యను కోల్పోయిన పురుషులు, కుటుంబ సభ్యుల నుంచి వేరుగా జీవిస్తున్న ఒంటరి వ్యక్తులు కూడా రాష్ట్రంలో ఉన్నారన్నారు. వీరికి బీమా భద్రత అవసరం లేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకొచ్చిన ప్పుడు, ఒంటరిగా జీవిస్తున్న అర్హులను సాంకేతిక నిబంధనల పేరుతో పథకానికి దూరం చేయడం సరైంది కాదన్నారు.రేషన్ కార్డులో ఒక్కరే ఉన్నవారికి కూడా ఇందిరమ్మ బీమా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, ఇతర రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులు లేదా చట్టబద్ధమైన నామినీలను ఎంపిక చేసుకునే వెసులు బాటు కల్పించి నామినీ సమస్యతో తిరస్కరణకు గురైన దరఖాస్తులను తిరిగి పరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గాగిల్లాపూర్ వాసికి

చేయూత పెన్షన్ మంజూరు

వాస్తవం : బెజ్జంకి



మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన దర్శనం శంకర్ గత 8 సంవత్సరాల క్రితం పక్షవాతంతో కాలు, చెయ్యి పడిపోయి మంచానికే పరిమితమయ్యాడు.8 సంవత్సరాలుగా ఆయనకు చేయూత పెన్షన్ ప్రభుత్వం మంజూరు చేయలేదు. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శంకర్‌కు చేయూత పెన్షన్ మంజూరు చేసి ఉత్తర్వులు అందచేసింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తనకు పెన్షన్ మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు, పులి కృష్ణకు, , గ్రామ సర్పంచ్ ఎర్రల జానకి రాజు కు కృతజ్ఞతలు తెలిపారు.

కలుషిత నీరు రాకుండా చూడాలి

ఆర్జీ 3, ఏపీఏ జీఎంలకు టీబీజీకేఎస్ వినతి

వాస్తవం : రామగిరి:

సింగరేణి కాలనీవాసులకు నిరంతరం శుద్ధమైన తాగు నీటిని అందించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఆర్జీ 3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య డిమాండ్ చేశారు.సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్,అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్జీ 3,ఏపీఏ జీఎంలు సుంకర మధుసూదన్,కొలిపాక నాగేశ్వరరావులకు నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగెల్లి సాంబయ్య మాట్లాడుతూ గోదావరిఖనిలోని ఇంటెక్ వెల్ వద్దకు ఎఫ్ సీఐ,ఎన్టీపీసీ,పట్టణ మురుగునీరు చేరడం వల్ల 8 ఇంక్లైన్,సెంటినరీ కాలనీలకు కలుషిత నీరు వస్తోంది. దీని వల్ల కార్మిక కుటుంబాలు చర్మవ్యాధులు,మలేరియా బారిన పడుతున్నారని.రూ. 17 కోట్లతో నిర్మిస్తున్న ఎస్టీపీ పనులను త్వరగా పూర్తి చేయాలి.ఫిల్టర్ బెడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ,నీటి నాణ్యత పరీక్షల తర్వాతే



నీటిని విడుదల చేయాలని.కాలనీలలో డ్రైనేజీ పక్కనే ఉన్న పాత పైప్‌లైన్ల వల్ల మురుగునీరు కలుస్తోంది.పాత పైప్‌లైన్లను మార్చి,ఎండిపోయిన బోర్లకు మరమ్మతులు చేయాలి,ఖాళీ క్వార్టర్ల నల్లాలకు డమ్మీలు బిగించి నీటి వృథాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ దేవా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రీనివాస్ రెడ్డి,ఈసంపల్లి రమేష్,కంది రమ్య రెడ్డి, పెద్ది స్వామి, మాదారపు కేశవరావు,గట్టు శ్రీనివాస్, బోయినపల్లి శ్రీకాంతరావు బ్రాంచ్ సెక్రటరీ అల్లం తిరుపతి,ఓ సి 1 పిట్ సెక్రటరీ గిటుకు శ్రీనివాస్,బేస్ వర్క్ షాప్ పిట్ సెక్రటరీ బోగం పూర్ణాకర్,సిహెచ్ పిట్ సెక్రటరీ బుద్దే ఉదయ్,ఓసి 2 అసిస్టెంట్ పిట్ సెక్రటరీ వీరగోని సంతోష్ గౌడ్,బ్రాంచ్ నాయకులు బాబురావు, పెరిక రమేష్, కూతాటి వెంకటయ్య, టి.వెంకటేష్, బి.రమేష్,ఎం.రమేష్,ఏ.సదన్ పాల్గొన్నారు.

మొలంగూర్ దూద్ బావిని

పరిశీలించిన డిపిఓ జగదీష్

వాస్తవం : శంకరపట్నం



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల మొలంగూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల చారిత్రాత్మక పేరు గుర్తుతెరిగిన దూద్ బావిని డిపిఓ గణేష్ శుక్రవారం నాడు పరిశీలించారు. ఆయన బావి ప్రత్యేకత చేరిత్రలను గ్రామ ప్రజల ద్వారా తెలుసుకున్నారు. చరిత్రగా గుర్తింపు ఉందని ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అతనితోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

సర్పంచ్ కల్లూరి అనిత వెంకట్ రెడ్డి



వాస్తవం : మాడుగులపల్లి :

మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుఇసుక బాయ్ గూడెం గ్రామానికి చెందిన వల్లపురెడ్డి విజయ్ రెడ్డికి మంజూరు కావడంతో స్థానిక సర్పంచ్ కల్లూరి అనిత వెంకట్ రెడ్డి చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదవారికి అండగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఆపద సమయంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. అనంతరం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డికి సర్పంచ్ మరియు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ వల్లపుదాసు అశోక్,కాంగ్రెస్ నాయకులు మంచికంటి జగన్ రెడ్డి, మొల్లాల కృష్ణారెడ్డి, మంచికంటి నాగిరెడ్డి, పుట్ట రాజయ్య, మడి ఎల్లయ్య, జిన్న అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

నషా ముక్త్ భారత్ పాదయాత్ర ముగింపు సభలో తోకల శ్రీనివాస్ రెడ్డి

వాస్తవం : రాజేంద్రనగర్



మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టి, యువత భవిష్యత్తును కాపాడాలనే సంకల్పంతో నిర్వహించిన మూడు రోజుల 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' మహా పాదయాత్ర ఘనంగా ముగిసింది. శుక్రవారం జరిగిన ముగింపు సభలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో పాటు బీజేపీ ముఖ్య నాయకులు,పార్టీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి సైతం ముగింపు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...హైదరాబాద్ విద్యార్థులు తమ సృజనాత్మకతతో చిత్రాలు, పోస్టర్ల ద్వారా మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. నషా ముక్త్ భారత్ కలను సాకారం చేయడంలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.రేపటి పిల్లల మంచి భవిష్యత్తు కోసం మనమందరం కృషి చేయాలన్నారు. ఈ ప్రయత్నంలో చిన్నారులు సైతం భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

దీక్షా దివస్‌కు కదంతొక్కుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

వాస్తవం : ఎల్లారెడ్డిపేట:



దీక్షా దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న కరీంనగర్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి తరలిరావాలని బీఆర్ఎస్ శ్రేణులు ఎల్లారెడ్డిపేట మండలంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి.బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు కార్యక్రమ ఆహ్వానాన్ని అందిస్తున్నారు. డప్పు చప్పుళ్లతో ప్రచారం నిర్వహిస్తూ గ్రామాల్లో పార్టీ శ్రేణులను సమీకరిస్తున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టమని, ఆ దీక్షా దివస్ సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిస్తున్నారు.కరీంనగర్ సభలో కేసీఆర్ ప్రసంగం ఉంటుందని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి ప్రజలకు చాటిచెప్పేలా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి.మండల అధ్యక్షులు, వివిధ నాయకులు, బూత్ కన్వీనర్లు, మహిళా కార్యకర్తలు ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

అర్హులైన పేదలకు పెన్షన్ మంజూరు చేయాలి



వాస్తవం : శంకరపట్నం

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో అర్హులైన పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్ లబ్ధి చేకూర్చాలని బీజేపీ మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్, ఎండిఓకు మండల ప్రజా పరిషత్ అధికారికి అనితకు వినతి పత్రం అనంతరం అందజేశారు. అనంతరం అధ్యక్షుడు పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పథకం ద్వారా ప్రతి ఒక్కరికి అర్హులైన చాలా ని ప్రతి ఒక్కరికి అందించాలని ఆయన పేర్కొన్నారు. లేనియెడల ఆందోళన చేయవలసిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు అలివేలు సమ్మిరెడ్డి, దండు కొమురయ్య, జంగ జైపాల్, దసరాపు నరేందర్, కొయ్యడ అశోక్, బిజిలి సారయ్య, కనకం సాగర్, రాస మల్ల శ్రీనివాస్, చర్ల శ్రీనివాస్, పోతునూరి రాజు, జానపట్ల రాజిరెడ్డి కాంతార్ల రాజిరెడ్డి, బోడ తిరుపతి, కనకం కుమార్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా కేసీఆర్ దీక్ష

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఇంచార్జ్ మాగంటి సునీత గోపీనాథ్

వాస్తవం : జూబ్లీహిల్స్



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ మాగంటి సునీత గోపీనాథ్ అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసఫ్ గూడా డివిజన్ పరిధిలోని గణపతి కాంప్లెక్స్ వద్ద ఉన్న వారి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని(జూబ్లీహిల్స్)ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు ప్రతికగా నిలచిన నవంబర్ 29వ తేదీన ప్రతి సంవత్సరం దీక్షా దివస్ జరుపుకుంటున్నామని తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నవంబర్ 29 (2026) ఆదివారం ఉదయం 10 గంటలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసఫ్ గూడాలోని వారి క్యాంపు కార్యాలయం వద్ద దీక్షా దివస్ ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాగంటి సునీత గోపీనాథ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్, ఐలపాక నర్సింగ్ దాస్, న్యాయవాది, సీనియర్ నాయకులు నవీన్ పటేల్, ఆనంద్ కుమార్, సమద్, ఎల్లేష్, చంద్రశేఖర్, నాగరాజు, శ్రవణ్ కుమార్, రఫియా, మహమ్మద్ షకిల్, రాయల్ ప్రభాకర్, జీవన్, ఎంఎల్ శివ, ఎస్ శివ, అబ్రహం, సందీప్, బొట్టు శివ, ధర్మ, డేవిడ్, సంతోషి, సువర్ణ కుమారి, శరత్, వేణుగోపాల్, సాయి తేజ, డి వెంకటేష్, సిహెచ్ వెంకన్న, పి నర్సింగరావు, జి యాదగిరి, ఈ యాదగిరి, కే రవి, కే. శ్రీనివాస్, శరత్ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌ని

సందర్శించిన బీజేపీ నాయకులు



వాస్తవం : అందోల్

ఫుడ్ పాయిజన్ కు గురైన జోగిపేట బాలికల హాస్టల్‌ను బీజేపీ రాష్ట్ర నాయకులు సందర్శించారు. ఫుడ్ పాయిజన్ కు గురైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో సందర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ హాస్టల్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని సౌకర్యాలు కూడా ఏమీ లేవని చాలీచాలని సౌకర్యాలతో విద్యార్థులు అనేక ఇబ్బందులుపడుతున్నారని వారు ఆపోయారు. ఇరుకు గదులు చాలిచాలని బాత్రూంలో విద్యార్థులు ఎలా మసులుకుంటారని వారుఆగ్రహం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో అందోల్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ చంటి ప్రభు, జోగిపేట మాజీ కౌన్సిలర్ పులుగు గోపి, నాయకులు గాజుల అనిల్, ఆంజనేయులు యాదవ్, నర్సింలు, నాగేష్ ,ప్రభాత్, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌జీసీఎల్ రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విజ్ఞప్తి

పెండింగ్ పనులను వెంటనే పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరిన ఎమ్మెల్యే

వాస్తవం : రాజేంద్రనగర్

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఎండీ ఉపేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ని యోజకవర్గంలోని కిస్మత్‌పూర్, నార్సింగి, మణికొండ, గొల్లపల్లి ప్రాంతాల్లో చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణ పనుల పు రోగతిపై చర్చించారు. ముఖ్యంగా వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న పనులను ఎమ్మెల్యే ప్రస్తావించారు. వా టిని వెంటనే పునఃప్రారంభించి నిర్దిష్ట సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోడ్ల నిర్మా ణ పనులు ఆలస్యం కావడంతో స్థానిక ప్రజలు, వాహన దారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన అధికా రుల దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి పనులను వేగవంతం



చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభి స్తుందన్నారు. దీంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నేడు మేడిపల్లి భూముల

రీ-సర్వే పై గ్రామ సభ

తహసీల్దార్ పర్నంది సుమన్



వాస్తవం : రామగిరి:

మేడిపల్లి భూములకు సంబంధించిన రీ సర్వే ప్రక్రియపై శనివారం ఉదయం 10.30 గంటలకు రత్నాపూర్ గ్రా మ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహిం చనున్నట్లు రామగిరి తహసీల్దార్ పర్నంది సుమన్ తెలి పారు. ఈ గ్రామ సభలో మేడిపల్లి భూము లకు సంబం ధించిన రీ సర్వే అంశాలపై చర్చించనున్న నేపథ్యంలో, సంబంధిత రైతులం దరూ సమావేశానికి హాజరు కావాలని తహసీల్దార్ సూచించారు. రైతులు గ్రామ సభలో పాల్గొని తమ భూములకు సంబంధించిన వివరాలు, సమస్యలను అధికారుల దృష్టికి తీ సుకురావాలని కోరారు. మేడిపల్లి భూములకు సంబంధించిన రీ సర్వే ప్రక్రియలో రైతు ల భాగస్వామ్యం అవసరమని, గ్రామ సభను విజయవంతం చేయాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

దీక్ష దివస్ విజయవంతానికి

సమన్వయంతో పనిచేయాలి

సమీక్ష సమావేశంలో దిశానిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

వాస్తవం : హుస్నాబాద్:

దీక్ష దివస్ విజయవంతమయ్యేలాగా నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. హు స్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నవం బర్ 29న కరీంనగర్ జిల్లా అలుగునూరులో నిర్వ హించనున్న దీక్షా దివస్ సభను విజయవంతం చేయ డంపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముందస్తు సమీక్ష సమా వేశం నిర్వహించారు.ఈ సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు , బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, దీక్షా దివస్ సభకు నాయకులు, కార్యకర్తల సమీకరణ, సభ



నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు.నవంబర్ 29న నిర్వ హించనున్న దీక్షా దివస్ సభకు హుస్నాబాద్ నియోజ కవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచిం చారు.ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహరహిత

సమాజమే మన లక్ష్యం



వాస్తవం : కాసిపేట

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కోమటి చేను గ్రామపంచాయతీలోని రేగుల గూడా గ్రామంలో శుక్రవారం రోజు అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినో త్సవ సదస్సును రేగులగూడ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటి చేను గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ కొడప. అనంతరావు, మరియు సూ పర్వైజర్ రాధిక మాట్లాడుతూ.. చిన్న వయసులో వివాహం వల్ల బాలికలు ముందస్తు గర్భధారణ, ఆరోగ్య సమస్యలు, తల్లి శిశుమరణాల ప్రమాదం, గృహహింస వంటి ముప్పులను ఎదుర్కోవాల్సి వస్తుందని, అదేవిధంగా విద్యకు దూరమై, ఆర్థిక స్వాలం బ నాన్ని కోల్పోయి అనేక బాధలు పడవలసి వస్తుందని, అందువల్ల ఆడపిల్లలకు 18 సం వత్సరాలు నిండే వరకు సురక్షితమైన బాల్యాన్ని నాణ్యమైన విద్యను అందించడం తల్లి దండ్రుల మరియు మన అందరి బాధ్యత అని చెప్పుకొచ్చారు. ఒకవేళ ఇవేవీ పట్టిం చుకోకుండా ఎవరైనా బాల్యవివాహాలు జరిపిస్తే చట్టరీత్యా అది నేరంగా పరిగణిం చబ డుతుందని, ఆ వివాహాలకి ప్రోత్సహించిన ప్రతి వారిని చట్టం తగు సెక్షన్ల ప్రకారం శిక్షలను విధించవలసి వస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొ డప అనంతరావు, అంగన్వాడి టీచర్ నిర్మల, సూపర్వైజర్ రాధిక, విద్యార్థులు తల్లి దండ్రులు రేగులగూడ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జీడీకే 11 ఇంక్లైన్ గనిని

సందర్శించిన కార్పొరేట్ జీఎం సేఫ్టీ కృష్ణ గోపాల్ తివారి

గని కార్మికులకు సేఫ్టీపై ప్రాక్టికల్ అవగాహన

భద్రతా ప్రమాణాల అమలుపై అధికారులకు సూచనలు

వాస్తవం : గోదావరిఖని

సింగరేణి రామగుండం ఏరియాలోని జీడీకే 11 ఇంక్లైన్ గనిని కార్పొరేట్ జీఎం సేఫ్టీ కృష్ణ గోపాల్ తివారి సం దర్శించారు జీఎం సేఫ్టీగా బాధ్యతలు స్వీకరించిన అనం తరం తొలిసారిగా ఈ గనికి విచ్చేసిన ఆయనకు గని అధికారులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా తొలుత గని ఏజెంట్ కార్యాలయంలో గనిలోని వివిధ సీముల ప్యానెల్స్, గని ప్రణాళికలను ఆయన పరిశీలించారు గని ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు కార్మికుల రక్షణ కోసం చేపడుతున్న భద్రతా చర్యల గురించి అధికారులు వివ రించారు.సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు, రామగుండం ఏరియా జీఎం డి లలిత్ కుమార్ ఆధ్వ ర్యంలో గని ఏజెంట్ సి శ్రీనివాస్ నేతృత్వంలో గనిలో సీపీఆర్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు సూపర్‌వైజర్లు ఉద్యోగులు కాంట్రాక్టు కార్మికులకు గుండె సంబంధిత



అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు ఉప యోగపడే సీపీఆర్ విధానంపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ స్వయంగా సీపీఆర్ చేసే విధా నాన్ని వివరించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమా న్ని గనిలో సమర్థవంతంగా త్వరితగతిన పూర్తి చేయడ ంపై కార్పొరేట్ జీఎం సేఫ్టీ కృష్ణ గోపాల్ తివారి గని అధికారులను అభినందించారు. అనంతరం గనిలోని రెండవ సీమ్‌లో పని ప్రదేశాలను పరిశీలించి అక్కడ అమలవుతున్న భద్రతా ప్రమాణాలను సమీక్షించారు. కార్మికుల ప్రాణరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని విధి నిర్వహణలో భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తగిన సలహాలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జీఎం సేఫ్టీ ఆర్జీ రీజియన్ ఎం. మల్లయ్య, గని ఏజెంట్ సి శ్రీనివాస్ గ్రూప్ ఇంజనీర్ నారాయణమూర్తి, గని మేనేజర్ మాథ్యూస్ జాన్సన్ , పిట్ ఇంజనీర్ డి. శ్రీని వాస్ ,సేఫ్టీ ఆఫీసర్ వి లక్ష్మీనారాయణ, ఎస్ఎస్ఓ ఎం నారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో

అంతరాయం

వాస్తవం : హుస్నాబాద్ :

హుస్నాబాద్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. హుస్నాబాద్ 132 కేవీ సబ్ స్టేషన్ లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం గం.9:00 నుండి మధ్యా హ్నం గం.1:00 వరకు హుస్నాబాద్ మునిసిపాలిటీ, హుస్నాబాద్ మరియు అక్కన్నపే ట మండలాల పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుం ది కాబట్టి వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు. దీని కారణంగా 4 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత



వాస్తవం : ఎల్లారెడ్డిపేట:

ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ అనుమతులు లే కుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రా క్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘ టన శుక్రవారం సాయం త్రం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణ పూర్ గ్రామానికి చెందిన బోదాసు అరవింద్ (26), తండ్రి మల్లే శం, ఎలాంటి ప్రభు త్వ అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. ట్రాక్టర్‌తో పాటు డ్రైవర్‌ను అదు పులోకి తీసుకుని పోలీస్ స్టే షన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభు త్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి చేయాలి

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

వాస్తవం : రాజేంద్రనగర్

బాల్యవివాహాల నిర్మూలన కేవలం చట్టాలతోనే సాధ్యం కాదని దీనికి ప్రతి ఒక్కరి సమిష్టి కృషి అవసరమని రా జేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ జూనియర్ కళాశా లలో ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల్య వి వాహాల నిర్మూలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ వంటి సామాజిక దురా చారాలను పూర్తిస్థాయిలో నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రతి బాలికకు నాణ్యమైన విద్య, తగిన రక్షణ, గౌరవప్రదమైన బాల్యాన్ని అందించ



డం మన బాధ్యత అన్నారు. అప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందు కు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల తహసీల్దార్ బొమ్మ రాములు, పలువురు అధికారులు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చట్టాలపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం

జూనియర్ సివిల్ జడ్జి పి. రవి

వాస్తవం : చెన్నూర్ ఆర్సీ



న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా శుక్రవారం కోటపల్లి మం డల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జూని యర్ సివిల్ జడ్జి పర్వతపు పి. రవి అధ్యక్షతన, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై పడే ప్రభావం గురించి వివరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగానికి సంబంధించి చీఐూూ చట్టంలోని నిబంధనలు, వాటి ఉల్లంఘనకు విధించే శిక్షల గురించి అవగాహన కల్పించారు.అదేవిధంగా చిన్నారులు, బాలబాలికల రక్షణ కోసం రూపొందించిన పోక్సో చట్టం గురించి వివరించి, బాలలపై జరిగే లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షణ పొందే హక్కులు, అటువంటి ఘటనలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన జా గ్రత్తలు, సంబంధిత అధికారులకు సమాచారం అందిం చాల్సిన విధానం గురించి తెలియజేశారు.ఈ సం దర్భం గా జూనియర్ సివిల్ జడ్జి పి. రవి మాట్లాడుతూ విద్యా ర్థులు చిన్న వయస్సు నుంచే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, చట్టా లపై అవగాహన పెంపొందించుకొని బాధ్యతాయు తమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. కోటపల్లి ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా, వాటికి పూర్తి గా దూరంగా ఉండాలని, ఎవరైనా మత్తు పదార్థాల విని యోగం లేదా విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమా చారం అందించాలని సూచించారు. అలాగే బాలలపై ఎలాంటి వేధింపులు జరిగినా భయప డకుండా తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల స్వావలంబనే అసలైన సాధికారత

వెన్నుపాము బాధితులకు

పీర్ ట్రైనింగ్ కొండంత అండ..

ఆత్మవిశ్వాసంతో స్వతంత్ర జీవనానికి బాటలు

సంగారెడ్డి జిల్లాలో 48 దివ్యాంగుల ఉద్యోగ ఖాళీల గుర్తింపు

సమన్వయంతో సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి

జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి

వాస్తవం : పటాన్‌చెరు



వెన్నుపాము గాయాలతో జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో స్వతంత్రం గా జీవించేలా దివ్యాంగులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి సూచించారు. దివ్యాంగుల పునరావాసం, స్వావ లంబన, జీవన నైపుణ్యాల అభివృద్ధికి పీర్ ట్రైనింగ్ కా ర్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొ న్నారు. రుద్రారం డోయన్ కౌంటీ టౌన్‌షిప్‌లోని ట్రియో రిసార్ట్స్‌ లో మోటివేషన్ ఇండియా, స్పైనల్ కార్డ్ ఇంజురీ అసోసి యేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో స్టేట్ స్ట్రీట్, క్యాఫ్ అమెరికా సహకారంతో నిర్వహిస్తున్న మూడు రోజుల పీర్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి అవకాశాలు అందించడంతో పాటు సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.స్పైనల్ కార్డ్ ఇంజురీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు షఫీ మాట్లాడుతూ వెన్నుపాము గాయాలకు గురైన వారికి వైద్య చికిత్సతో పాటు సామాజిక, ఆర్థిక పునరావాసం కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఇతరులపై ఆధారపడే స్థితి నుంచి ఆత్మవిశ్వాసంతో స్వతంత్రంగా జీవించే స్థాయికి చేరుకోవడానికి పీర్ ట్రైనింగ్ ఉపయోగ పడుతుందన్నారు. దివ్యాంగులకు సానుభూతి చూపడం కంటే సమాన అవకాశాలు, అందుబాటులో మౌలిక వస తులు, ఉపాధి కల్పించడమే నిజమైన సాధికారత అని స్పష్టం చేశారు.జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి దివ్యాంగుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని షఫీ అభి నందించారు. రాష్ట్రంలోనే ముందుగా హెచ్ఎస్ఎన్ క్యాంపు నిర్వహించడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖ ల్లోని రోస్టర్ రిజిస్టర్లను పరిశీలించి సంగారెడ్డి జిల్లాలో దివ్యాంగులకు సంబంధించిన సుమారు 48 ఉద్యోగ ఖాళీలను గుర్తించడం అభినందనీయమన్నారు. మో టివేషన్ ఇండియా ప్రతినిధులు సుధాకర్, నందిని శ్రీని వాసన్, రాము మాట్లాడుతూ వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తుల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అ వసరమైన శిక్షణ, సహకారం గురించి వివరించారు.ఈ శిక్షణలో వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తులే తమ జీవిత అనుభవాలను తోటి బాధితులతో పంచుకుంటూ శిక్షణ అందించడం ప్రత్యేకతగా నిలిచింది. వీల్‌చైర్ విని యోగం, రోజువారీ పనులు స్వయంగా చేసుకోవడం, వ్యక్తిగత జీవన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించు కోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీర్ ట్రైనర్లు, వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెద్దాపురం పీఏసీఎస్‌లో రైతు పండుగ

కొత్త పాలకవర్గం.. కొత్త ఆశలు

ఒకే కుటుంబంగా ముందుకు

రైతుల కోసం కొత్త టీం రెడీ

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

వాస్తవం : వరంగల్



దామెర మండలం ఊరుగొండ సొసైటీ కార్యాల యంలో పెద్దాపురం పీఏసీఎస్ చైర్మన్ కమలాపురం రమేష్ మరియు పాలకమండలి సభ్యుల పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమం శుక్రవారం రైతు పండుగలా ఘనం గా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర కాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు ఊరుగొండ స్టేజి నుంచి కార్యాలయం వరకు డప్పు చప్పులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షే మమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుం దని, రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకార సంఘాలే బల మైన వేదికలని, వాటిని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, ఒక కుటుంబంగా పని చేసి పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రైతులు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే పీఏ సీఎస్ వ్యవస్థ ప్రారంభించారని అన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించడం, వారి సమస్యలకు పరి ష్కారం చూపడం నూతన కార్యవర్గం ప్రధాన బాధ్యతగా భావించాలని సూచించారు. క్లస్టర్ వారిగా ఫార్మర్స్ ప్రొ డ్యూస్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేస్తామని, కాలానికి అను గుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను రై తులు అందిపుచ్చుకోవాలని, ఆధునిక సాంకేతిక పరి జ్ఞానాన్ని వినియోగించుకుంటూ నూతన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. పెద్దాపురంలో గోదాం నిర్మిస్తామని, పీఏసీఎస్ కార్యాలయం చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో పీఏసీఎస్ సొసైటీల బాధ్యత ఎంతో ముఖ్యమైనదని అన్నారు. సహకార వ్యవ స్థ ద్వారా రైతులకు లాభం చేకూర్చే విధంగా ముందుకు వెళ్తామని, ఒక కన్సల్టెన్సీ ద్వారా రైతులకు అవగాహన కల్పించి శిక్షణలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో డిసిఓ మోహన్, ఊరుగొండ సర్పంచ్ పోలేపాక శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ పరకాల చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పీఏసీఎస్ పెంచికలపేట చైర్మన్ అగితే లింగన్న, పీఏసీఎస్ ఆత్మకూరు చైర్మన్ నాగేల్లి స్వప్న ఆంధ్రయ, ఎమ్మార్వో జ్యోతి, ఏవో రాకేష్, ఎస్సై వీరభద్రం, పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుబాసి రాజేందర్, రేవూరి జలంధర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అంబటి రాజస్వామి, లింగమడుగుపల్లి గ్రామపంచాయతీ కంటెస్టెంట్ సర్పంచ్ మరియు నూతన పాలకవర్గ డైరెక్టర్ కొడగాని ప్రసాద్, సర్పంచులు,నాయకులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



పోలీసులు నిబద్ధతతో

విధులు నిర్వహించాలి

సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్



వాస్తవం : హుస్నాబాద్ :

పోలీసులు క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సిద్దిపేట సీపీ రష్మీ పెరు మాళ్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తని ఖీలలో భాగంగా శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ తనిఖీ చేశా రు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు కోహెడ ఎస్ఐ అభిలాష్ సిబ్బందితో రిపోర్ట్ చేశారు. అనంతరం ఎస్ఐ పరేడ్ నిర్వహిస్తుండగా సీపీ పరిశీలించారు. అనం తరం సిబ్బంది యొక్క కిట్ ఆర్టికల్స్‌ను, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ కేసుల కు సంబంధించిన వాహనాలను తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశా రు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డులు మరియు అన్ని వర్టికల్స్ పనితీరును సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని అన్నారు. ప్రజల సమస్యలను ఓపికగా విని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల ని యంత్రణకు ప్రతి గ్రామంలో 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా సీసీ టీవీ కెమెరాల నిఘాను పెంచేలా ఎస్ఐ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం సిబ్బంది యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వర్టికల్ ఇన్‌చార్జ్ తమ బా ధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో హుస్నాబాద్ ఏసిపి సదానందం, ట్రైనీ డీఎస్పీలు సుమా శ్రీ, భారత్ రెడ్డి, ఎండీ. ముషరఫ్ , హుస్నాబాద్ సీఐ శ్రీధర్, ఎస్ఐ అభిలాష్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటికి పనులు ప్రారంభించిన


సర్పంచ్ గద్దల విమల- రాజయ్య



వాస్తవం : రామగుండం రూరల్

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి, మర్రిపల్లి గ్రామంలోని ఇంది రమ్మ కాలనీలో ప్రభుత్వం నూతనంగా అందించినటువంటి ఇందిరమ్మ ఇళ్లకు సర్పంచ్ గద్దల విమల- రాజయ్య ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గద్దల విమల- రాజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా మూడో విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు. దీనిలో భాగం గానే మర్రి పల్లి లో కోట శ్రీలత- విలాస్ దంపతుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. దీనికి గ్రామ ప్రజలు ప్రభుత్వం పట్ల, సర్పంచ్ గద్దల విమ ల- రాజయ్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గద్దల విమ ల- రాజయ్య, ఏడో వార్డు సభ్యులు దుర్గం లక్ష్మి- శంకర్, పాస్టర్ జ్యోతి బాబు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపిన క్రీడా పోటీలు



వాస్తవం : ఎల్లారెడ్డిపేట : సిరిసిల్ల మండల కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినో త్సవాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల పట్టణంలోని సత్యసాయి సేవా మందిరంలో దివ్యా ంగులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియంకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.క్రీడా పోటీల ప్రారంభోత్స వానికి ముఖ్య అతిథులుగా ఆర్టీఓ దేవునూరి శ్రీనివాస్, డీడబ్ల్యూఓ లక్ష్మీ రాజం హాజర య్యారు. ఆర్టీఓ శ్రీనివాస్ క్యారం ఆటను, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం చెస్ పోటీలను ప్రారం భించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో మనోధైర్యం, మా నసిక ఉత్సాహం పెంపొందించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడ తాయని అన్నారు. ప్రతిభలో దివ్యాంగులు ఎవరికీ తీసిపోరని, ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వా సంతో ముందుకు సాగాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవా లని తెలిపారు. అ ర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని వారు తమ దృష్టికి తీసు కువస్తే అర్హతను బట్టి పథకాలు అందేలా కృషి చేస్తామని డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం హామీ ఇచ్చారు. అర్హు లైన దివ్యాంగులకు డ్రైవింగ్ లైసెన్సులు కూడా అందించేందుకు చర్యలు తీసు కుంటా మని ఆర్టీఓ దేవునూరి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఎవరూ నిరుత్సాహపడవద్దని, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
Cell No - 8074124190 Editor : MANASANI KRISHNA REDDY

రూ.10వేల కోట్లతో ప్రణాళిక

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సిద్ధం
సంక్రాంతి తర్వాత ప్రతి నెలా 2వేల కోట్ల పనులు
రాబోయే 8 నెలల పాటు ఎల్‌నినో ప్రభావం
'క్లైమేట్ కాన్‌క్లేవ్' సన్నాహక భేటీలో సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 27 :

రాష్ట్రంలో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రూ.10వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని సిద్ధం చేశామని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాబోయే 8 నెలల పాటు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పారు. అందుకే సంక్రాంతి తర్వాత ప్రతి నెలా రూ.2వేల కోట్ల విలువైన పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటలకు దూరంగా ఉండాలని కోరారు. ఒక సీజన్‌లో వరి పంటను త్యాగం చేస్తే పశుసంపద, పర్యావరణాన్ని కాపాడుకున్నట్టు అవుతుందని వివరించారు. ఎల్ నినో ప్రభావం మొదలయ్యే నాటికే బియ్యం నిల్వలను సిద్ధం చేశామని, రెండేళ్లకు సరిపడా నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇప్పుడు వచ్చింది తిండిగింజల కరవు కాదని, తాగునీటి కరువని పేర్కొన్నారు. రాబోయే ఎనిమిది నెలల పాటు నీటిని పొదుపుగా వాడాలని పిలుపు నిచ్చారు. కోవిడ్ లాంటి సంక్షోభమే ఎల్‌నినో కూడా అని హెచ్చరించారు. రాష్ట్రంలో పెట్టుబడు లతోపాటు పర్యావరణానికి కూడా సమాన ప్రాధా న్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న క్లైమేట్ కాన్‌క్లేవ్ సన్నాహక సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. మంత్రులు ఉత్తమ్, సీతక్క, ఆధ్యాత్మికవేత్త రవిశంకర్, వాటర్‌మ్యాన్ రాజేంద్రసింగ్, పలువురు ఉన్నతాధికారులు ఇందు లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవం త్‌రెడ్డి ప్రసంగించారు. "పెట్టుబడులు, పర్యావరణం మధ్య సమతుల్యత పాటించకపోతే భవిష్యత్ తరా లు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. గ్లోబల్ సమ్మిట్‌లో పెట్టుబడుల ఆకర్షణ తోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం పండిట్ రవిశంకర్, వాటర్‌మ్యాన్ రాజేంద్రసింగ్‌తోపాటు పర్యావరణ వేత్తల నుంచి సలహాలు, సూచనలు తీసుకోను న్నాం. వారి సలహాలు, సూచనలతో ప్రత్యేక పాలసీని రూపొందిస్తాం. ఈ క్రమంలోనే క్లైమేట్ కాన్‌క్లేవ్ ఏర్పాటు చేశాం" అని సీఎం తెలి పారు. పెట్టుబడుల్లోగానీ, పర్యావరణంలోగానీ గుజరాత్ మోడల్‌ను కాపీ కొట్టాల్సిన అవసరం తెలంగాణకు లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. "800 ఏళ్లకు ముందే మా పూర్వీకులు కుంటలు, చెరువులు మీద దృష్టిపెట్టారు. రేచర్ల రుద్రదేవుడు, రాణి రుద్రమదేవి వరంగల్‌లో అనేక చెరువులను తవ్వించారు. గొలుసుకట్టు చెరువులను నిర్మించారు. తెలంగాణది చెరువుల చరిత్ర. కానీ అనేక చెరువులు కాలక్రమేణా కనుమరుగయ్యాయి. అలాంటి చెరువులను, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం కోసమే హైడ్రాను ఏర్పాటు చేశాం. కబ్జాదారుల నుంచే కాకుండా కోర్టుల నుంచి కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ధనవంతులు తమ ఇళ్ల నిర్మాణాల కోసం, ఫంక్షన్ హాళ్ల కోసం చెరువులను ఆక్రమించారు. మేం ఆ చెర విడిపిస్తున్నాం. ఇప్పుడు బతుకమ్మ కుంట దగ్గర బతుకమ్మ ఆడుతున్నారు. హైటెక్ సిటీ దగ్గర తమ్మిడికుంట చెరువును పరిరక్షించాం. ఆ చెరువు ను ఆక్రమించిన వారి నుంచి స్థలాన్ని ఖాళీ చేయిం చాం. దీనిపై జాతీయ స్థాయిలో చర్చ జరిగింది" అని వివరించారు. మూసీ ప్రపంచంలోనే అత్యంత కలుషిత నదుల్లో ఒకటిగా మారిందని, అందుకే ప్రక్షాళన చేసి పరిరక్షించాలని నిర్ణయించామని రేవంత్ చెప్పారు. తమ ప్రభుత్వం భావితరాల కో సం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ అంశాల



ను తాము చెబితే రాజకీయం అవుతాయని.. అం దుకే పండిట్ రవిశంకర్, వాటర్‌మ్యాన్ రాజేం ద్ర సింగ్ లాంటి వారు భాగస్వాములైతే ప్రజలకు స్ప ష్టంగా అర్థమవుతుందని వారిని తీసుకొచ్చామని వివరించారు. ఎక్కడా కూడా పేదలకు ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. భవిష్య త్తులో సుందరమైన మూసీ నదిని తీర్చిదిద్దుతామని, అంతా చూస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అనేక పాలసీలు తీసుకువచ్చామని.. క్యూర్, ప్యూ ర్, రేర్‌గా రాష్ట్రాన్ని విభజించామని సీఎం రేవంత్ చెప్పారు. 3 వేల మంది సిబ్బందితో ఈగిల్ ఫోర్స్ మాదక ద్రవ్యాలను నియంత్రిస్తోందని.. కేంద్రం కూడా ఈగిల్ ఫోర్స్‌ను అభినందించిందని తెలి పారు. డ్రగ్స్ సరఫరాదా రులను, వాడుతున్నవారిని ఎవరినీ వదలడం లేదని.. తాను సీఎం కుర్చీలో నేను ఉన్నంతకాలం తప్పు చేసినవాళ్లను వదిలే ప్రసక్తే లేదని పేర్కొ న్నారు. ఆహార కల్తీ నియంత్ర ణకు టీజీసేఫ్ తీసుకువచ్చామన్నారు. హైదరాబా ద్‌లో డీజిల్ ఆటోలు, ఆర్టీసీ బస్సులను తగ్గిస్తున్నా మని, రెండు లక్షల డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్‌గా మారుస్తు న్నామని తెలిపారు.

బీజేవైఎం పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గానికి ఘన సన్మానం



వాస్తవం : రామగుండం

భారతీయ జనతా యువమోర్చా పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గంలో వివిధ పదవు లకు నియమితులైన యువ నాయకులను బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జీ కందుల సంధ్యారాణి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపా ధ్యక్షుడిగా పవన్, జిల్లా కార్యదర్శులుగా బూడిద హర్ష, మీడివెల్లి అంజనీ ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధిగా సిలారపు కళ్యాణ్, జిల్లా ప్రచార కన్వీనర్‌గా చిలువేరు కుమార స్వామి నియమితులైన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ,యువ నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, యువతను సంఘటితం చేసి, పార్టీ బలోపే తానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహి స్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు. నూత నంగా నియ మితులైన నాయకులు పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని తెలి పారు.ఈ కార్యక్రమంలో లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నరసయ్య, అం తర్గాం మండల అధ్యక్షులు బోడకుంటి సుభాష్,లేబర్ సెల్ కో-కన్వీనర్ ఎల్తూరి రాజ య్య, లేబర్ సెల్ సభ్యులు బియ్యాల మహేందర్,వీరబోయిన శ్రీనివాస్, జక్కుల ప్రవీణ్, హనుమాండ్ల వెంకటేష్, అరవింద్,సంతోష్, తదితరులు పాల్గొన్నారు..

చెన్నూరు 12వ వార్డులో కోతుల బీభత్సం

ఇళ్లపై రేకులు ధ్వంసం..
ప్రజలకు తీవ్ర నష్టం

జనోదయ : చెన్నూర్ ఆర్సీ

మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద రోజురోజుకూ పెరిగిపోతుండడంతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పట్టణంలోని 12వ వార్డులో కోతుల గుంపులు ఇళ్లపైకి చేరి రేకులను ధ్వంసం చేస్తూ, ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న షెడ్లను పగలగొడుతూ బీభత్సం సృష్టిస్తు న్నా యి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవు తున్నారు.గత రెండు రోజులుగా 12వ వార్డులో కోతుల గుంపులు ఇళ్లపైకి ఎక్కి రేకులను పగలగొట్టడం, ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న షెడ్లను ధ్వంసం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల దాడులు, ధ్వంసం కారణంగా ఒక్కో కుటుంబానికి సుమారు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు. ఇళ్లపై ఉన్న రేకులు పూర్తిగా దెబ్బతినడం తో వాటిని తొలగించి కొత్త రేకులు వేయాలంటే సుమా రు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చు చే యాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు వాపోతు న్నా రు.ఇప్పటికే నిత్యావసర ఖర్చులతో ఇబ్బందులు పడు తున్న సామాన్య కుటుంబాలకు కోతుల వల్ల కలిగే ఈ అదనపు నష్టం భారంగా మారుతోంది. ఇంటి పైకప్పు లపై కోతులు తిరుగుతూ రేకులను పగలగొట్టడం, ఇంటి పరిసరాల్లో వస్తువులను చిందరవందర చేయడం, ప్రజ లు బయటకు వెళ్లేందుకు భయపడే పరిస్థితులు నెలకొ నడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్న కుటుంబాలు మరింత ఆందోళన చెందు తున్నాయి.ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి కోతుల బెడద నివారణకు తగిన చర్యలు చేప ట్టాలని స్థానికులు కోరుతున్నారు. కోతులను పట్టుకునేం దుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు నష్టం కలగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వం, మున్సిపల్ కమిషనర్ మరియు సంబంధిత అధికారులు చెన్నూరు పట్టణ ప్రజల సమ స్యను గుర్తించి, ముఖ్యంగా 12వ వార్డులో కోతుల వల్ల నష్టపోయిన కుటుంబాలకు అండగా నిలవాలని, నష్ట ని వారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరు తున్నారు.ప్రజల ఇబ్బందులను అధికారులు ఇప్పటికై నా గుర్తించి స్పందిస్తారా కోతుల బెడదకు శాశ్వత పరి ష్కా రం చూపి చెన్నూరు ప్రజలకు ఉపశమనం కల్పిం చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



29న లంబాడి హక్కుల పోరాట సమితి సదస్సు

వాస్తవం : చెన్నూర్ ఆర్సీ

మంచిర్యాల జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు భూక్య రాజ్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో ఈ నెల 29న జనగామలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి సదస్సుకి సంబంధించిన పోస్టర్‌ను ఎల్‌హె చ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సమ్మయ్య నా యక్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సదస్సును విజ యవంతం చేయాలని సమ్మయ్య నాయక్, రాజ్‌కు మార్ పిలుపునిచ్చారు.తండాలను రెవెన్యూ గ్రామ పంచా యతీ లుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తండా ల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.పోడు భూములు సాగు చేసుకుం టున్న గిరిజనులకు హక్కు పట్టాలు జారీ చేయాలని, గిరి



జన ఉద్యోగ నియామకాల్లో 100 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ,గిరిజనులకు 10 శాతం రిజర్వే షన్ల కు రాజ్యాంగ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బంజా రాల మాతృభాష గోర్‌బోలీని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నా యకులు, సర్పంచులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



వాస్తవం : హుస్నాబాద్

హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నవంబర్ 29న కరీంనగర్ జిల్లా అలుగునూరులో నిర్వహించనున్న దీక్షా దివస్ సభను విజయవంతం చేయడంపై పార్టీ నాయకులు, శుక్రవారం కార్యకర్తలతో ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహిం చారు.ఈ సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లా డుతూ పార్టీ బలోపేతం,దీక్షా దివస్ సభకు నాయకులు, కార్యకర్తల సమీకరణ,సభ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు,భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చిం చారు.నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షా దివస్ సభకు హుస్నాబాద్ నియోజక వర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతి నిధులు పార్టీ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

వార్డు సందర్శనలో పాల్గొన్న చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య

వాస్తవం : పెద్దపల్లి



పెద్దపల్లి పట్టణంలోని 07 మరి యు 34 వ వార్డులను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య సంద ర్శించారు. వార్డు సందర్శనలో భాగంగా 07,34వ వార్డులలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. వార్డులలో నెలకొన్న డ్రైనే జ్, లైటింగ్, శానిటేషన్ తదితర సమస్యల ను స్థానిక కౌన్సిలర్లు ఈర్ల స్వరూప, అస్రఫ్ షరీఫ్ లతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చారు.ఈ సందర్భంగా చైర్మన్ నూగిళ్ల మల్లయ్య మా ట్లాడుతూ ఈ రెండు వార్డులలో లైటింగ్, శానిటేషన్, డ్రైనేజీ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. సమస్యలు నెలకొన్న ప్రాంతాలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పాటుపడతామన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావు సహకారంతో పెద్దపల్లి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈకార్యక్ర మంలో 7వ వార్డు కౌన్సిలర్ ఈర్ల స్వరూప, 34వ వార్డు అస్రఫ్ షరీఫ్‌లతో పాటు,వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

నంది మండలంలో ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



వాస్తవం : కమలాపురం రూరల్

నందిమండలం గ్రామంలోని చౌడమ్మ వీధిలో అయ్యప్ప స్వామి ఆరవ వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్ప స్వాములు పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వ హించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు అయ్యప్ప స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ గ్రామోత్సవంలో భాగంగా గువ్వల చెరువు రవి బృందంచే కోలాటం మరియు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని అయ్యప్ప స్వాములు పేర్కొన్నారు.